క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం


ఆలయ కమిటీకి విరాళమిస్తున్న ఏఎస్ఐ

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేములలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి ఇదే గ్రామానికి చెందిన ఏఎస్ఐ బత్తుల పెద్ద ఓబులేసు (కర్నూలు) శనివారం విరాళమిచ్చారు. తల్లిదండ్రులు సుందరమ్మ, బాలన్న జ్ఞాపకార్థం రూ. 10 వేలను ఆలయ కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, నారాయణస్వామికి అందజేశారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్ఏలు

కొలిమిగుండ్ల: తమ సమస్యలను పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం మండల అధ్యక్ష,ఉపాధ్యక్షులు హాజీవలి, రమణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వీఆర్ఏలు తహసీల్దార్ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని అన్నారు. అటెండర్, వాచ్‌మన్, రికార్డు అసిస్టెంట్ పోస్టులను వీఆర్ఏలతో భర్తీ చేయాలని కోరారు. పేస్కేల్ అమలు చేసి ఆదుకోవాలన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 22న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

జిల్లా మహా సభలను జయప్రదం చేద్దాం


వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

డోన్ టౌన్: ఈనెల 22న నంద్యాలలో జరగనున్న ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ విజయవంతం కావడానికి అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆశా వర్కర్స్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వినతిపత్రాలను పట్టణంలోని కొత్తపేట, పాతపేట అర్బన్ హెల్త్ సెంటర్లకు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని, కరోనా సమయంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా ప్రశంసలు అందుకున్నారని గుర్తుచేశారు. సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ ఈ మహాసభలో ఖరారవుతుందని తెలిపారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు


తలారి సుకన్య (ఫైల్)

బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైంది. వివరాలు.. గ్రామానికి చెందిన జవాజీ యుగంధర్ భార్య తలారి సుకన్య ఈ నెల 15వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర శెట్టి తెలిపారు.

వేడుకగా శివపార్వతుల కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

అన్నదానం


అన్నం వడ్డిస్తున్న నిర్వాహకులు

డోన్ టౌన్: పాత బస్టాండ్‌లోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద శ్రీవిశ్వాసునామ సంవత్సరం భాద్రపద మాస చతుర్దశి సందర్భంగా సాయిరాం స్టూడెంట్ హాస్టల్ నిర్వాహకులు నందకిశోర్ ఆధ్వర్యంలో శనివారం మహా అన్నదానం కార్యక్రమం జరిగింది.

సంజామలలో వర్ష బీభత్సం


ఆకుమల్లలో మొక్కజొన్న పొలంలో వర్షపు నీరు


నీటమునిగిన వరి పంట

సంజామల: మండలంలో శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మొత్తం 25.02 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆకుమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, గిద్దలూరు, పేరుసోముల, కానాల, ఆర్.లింగందిన్నె గ్రామాల్లో వర్షం బీభత్సం సృష్టించింది. సంజామల–కానాల రహదారి వద్ద వంకకు భారీ వరదనీరు పోటెత్తడంతో రాకపోకలు ఆగిపోయాయి. గిద్దలూరు–ఆర్.లింగందిన్నె మధ్యనున్న వంక, ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న వంకలు కూడా పొంగిపొర్లుతున్నాయి. ఆల్వకొండ క్రాస్–ఆల్వకొండ గ్రామం మధ్యనున్న పిల్లవంక నిండిపోయి ప్రవహిస్తోంది. ఆకుమల్ల, ఆల్వకొండ, సంజామల గ్రామాల పరిసరాల్లో పంటలు నీట మునిగాయి. ఈ ఏడాది వరుస వర్షాలతో ఖరీఫ్ పంటలకు నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఆల్వకొండలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

కొండమీద గ్రామాల్లో భారీ వర్షం


జూనుతలలో భారీగా ప్రవహిస్తున్న వర్షపునీరు

అవుకు(కొలిమిగుండ్ల): అవుకు మండలంలోని కొండమీద గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. మారేమడుగుల, కొండమనాయినపల్లె, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో వర్షం కురవడంతో వాగులు ఉప్పొంగాయి. ఆయా గ్రామాల్లోని కాలనీల్లో ఎక్కడా చూసినా వర్షపునీరు ప్రవహించాయి. కొద్ది సేపు జనం ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఎర్రమల కొండల్లో వాగులు అన్నీ ఏకం కావడంతో పెద్ద ఎత్తున నీరు ఎత్తిపోతల ద్వారా భారీగా అవుకు రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతున్నాయి. మండలంలో మిగిలిన గ్రామాల్లో మోస్తరు వర్షానికే పరిమితమైంది.

టెర్రస్ గార్డెన్‌పై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు టెర్రస్ గార్డెన్, కంపోస్టింగ్ పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయాధికారి శ్రీకృష్ణ, ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఇళ్లపైన అవసరమైన కూరగాయలు, ఆకుకూరల మొక్కలను పెంచాలని సూచించారు. టెర్రస్ గార్డెన్‌లో అనేక మేలైన పద్ధతులు అనుసరించి ప్లాస్టిక్ రహిత పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంభించాలన్నారు. అనంతరం టెర్రస్ గార్డెన్‌లో ఉపయోగించే పరికరాలు, యాజమాన్య పద్ధతులు, వంటగది, ఇంటిపేరట్లో కంపోస్టు తయారీ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, రమణారెడ్డి, నరేంద్రనాథరెడ్డి, అన్నపూర్ణ, లక్ష్మీదేవి, భాస్కర్‌నాయక్, కృష్ణదాసు, పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు


ఎన్‌సీసీ విద్యార్థులతో మాట్లాడుతున్న కల్నల్ అలోక్ త్రిపాఠి

బనగానపల్లె రూరల్: ఎన్‌సీసీలో శిక్షణ తీసుకోవడం వల్ల ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని కర్నూలు ఎన్‌సీసీ గ్రూపు కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని వన్ ఆంధ్ర మెడికల్ కంపెనీ విభాగం 145వ జూనియర్ డివిజన్‌ను ఆయన సందర్శించారు. క్రమశిక్షణ కలిగిన యువత దేశానికి ఎంతో అవసరమని, విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని సూచించారు. బాలికలు కూడా ఎన్‌సీసీ వైపు ఆకర్షితులవ్వడం సంతోషకరమన్నారు. విద్యార్థులు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రవీణత సాధించాలని సూచించారు. ఎన్‌సీసీ ఉన్నత చదువులకు రిజర్వేషన్ పొందడంలో కూడా ఉపయుక్తమని వివరించారు. ఎన్‌సీసీ అధికారి వెంకటేశ్వర్లు, మేజర్ వైవీసీకే రెడ్డి, లెఫ్టినెంట్ కల్నల్ శశికుమార్, హవల్దార్ రవి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, సురేష్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

బేతంచెర్ల: స్థానిక గొరిపేటలోని చెన్నకేశవస్వామి ఆలయంలో అలివేలుమంగ, పద్మావతీ దేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 22న శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 23న స్వామివారి కళ్యాణం, సాయంత్రం శేషవాహనంపై ఊరేగింపు ఉంటుంది. 24న హనుమద్ వాహనం, 25న ముత్యాల పందిరి, 26న గజవాహనం, 27న గరుడవాహనం, 28న సింహవాహనం, 29న చంద్రప్రభ వాహనం, 30న చిన్న రథోత్సవం, అక్టోబర్ 1న అశ్వవాహనం, 2న పూర్ణాహుతి, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. ప్రతిరోజూ ప్రత్యేక పూజలతో పాటు స్వామివారి ఉత్సవ విగ్రహాలను పట్టణ పురవీధులలో ఊరేగింపుగా తీసుకువెళతారని తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి

డోన్ టౌన్: చిన్న ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక సార్క్ పాఠశాలలో ప్యాపిలి యూనిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చిన్న ప్రైవేట్ పాఠశాలలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని అన్నారు. త్వరలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని బడ్జెట్ స్కూళ్లను సందర్శిస్తామన్నారు. కరెస్పాండెంట్లతో సమావేశాలు నిర్వహించి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్యాపిలి యూనిట్ సభ్యులు సుబ్బుయాదవ్, కిషోర్, ఇనాయత్, భరత్, సురేష్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోవెలకుంట్ల: స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల, దొర్నిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

బేతంచెర్ల: మండలంలోని బుగ్గానిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో శనివారం వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమోహన్, సీనియర్ నాయకుడు మధుమోహన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ అభివృద్ధికి చేస్తున్న సేవలను ఈ సందర్భంగా వివరించారు.

జర్నలిస్టు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

డోన్: డోన్ అక్రిడిటేషన్ జర్నలిస్టుల అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు శనివారం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని కలిసి సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి చేశారు. అధ్యక్షుడు శేఖర్, కార్యదర్శి మల్లి, గౌరవ సలహాదారు మల్లెంపల్లె సుధాకర్ తదితరులు ఆయన్ను కలిశారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సీనియర్ జర్నలిస్టులు వలిబాషా, కళ్యాణ్, తారక్ తదితరులు ఉన్నారు.

ఘనంగా దైవ సేవకుల సదస్సు

డోన్ టౌన్: స్థానిక కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో శనివారం రాయలసీమ దైవ సేవకుల సదస్సు ఘనంగా జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షుడిగా బైబిల్ మిషన్ రెవరెండ్ బండెలరాజు వహించగా జీసస్ క్రైస్ట్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు సిస్టర్ సంగీతపాల్, మండపేట మరియు కడవరి వర్షపు సంఘాల ప్రతినిధి బ్రదర్ ధర్మవీర్‌పాల్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి హాజరై సభ్యత్వ ధ్రువపత్రాలు అందజేశారు.

గంబూసియా చేపలతో దోమల నియంత్రణ


ఎర్రగుంట్ల కుంటలో చేపపిల్లలను వదులుతున్న వైద్యాధికారులు

డోన్: దోమలతో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు విస్తరిస్తున్నాయని మలేరియా సబ్‌యూనిట్ అధికారి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. దోమల నివారణ కోసం మండలంలోని కొత్తబురుజు, ఎర్రగుంట్ల గ్రామాల్లో వైద్యసిబ్బంది గంబూసియా చేప పిల్లలను వదిలారు. నీటి కుంటల్లో దోమలు పెట్టిన గుడ్లు, లార్వాలను ఈ చేపపిల్లలు తినడం వల్ల దోమల సంఖ్య తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి, పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, మధుసూధన్‌రావ్, నరసింహులు, ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

- ప్యాపిలి: పట్టణంలోని ఊరికుంటతో పాటు వెంగళాంపల్లి గ్రామంలోని ఊరికుంటలో శనివారం వైద్యాధికారి రాహుల్ ఆధ్వర్యంలో అధికారులు గంబూసియా చేపలను వదిలారు. ఈ చేపలు దోమల నియంత్రణలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. సీహెచ్ఓ సుమతీదేవి, డిప్యూటీ హెచ్ఈఓ రాఘవేంద్ర గౌడ్, మనోహర్‌రెడ్డి, సరోజ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు ఉధృతం


రణభేరిలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నేత ప్రసాద్

డోన్ టౌన్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్ హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన రణభేరి బైకుయాత్ర శుక్రవారం రాత్రి డోన్‌కి చేరింది. పాత బస్టాండ్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం నెరవేర్చలేదని, పీఆర్సీ కమిటీని వేయమంటే బకాయిలు తీర్చాకే వేస్తామని అనడం వల్ల 2027 వరకు తమకు వస్తాయన్న గ్యారంటీ లేదని అన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో కనీసం దసరా పండుగకు ఒక డీఏ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న గుంటూరులో జరిగే రణభేరి సభకు ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రేపటి నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు


ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

అవుకు(కొలిమిగుండ్ల): అవుకు పట్టణంలోని వాసవీ కన్యాకపరమేశ్వరిదేవి ఆలయంలో దసరా పండుగను పురస్కరించుకుని ఈనెల 22 నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. శనివారం ఆలయంలో ఆర్యవైశ్య సంఘం, యువజన, మహిళా సంఘం సభ్యులతో కలిసి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. రోజుకో రూపంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. 22న రాజరాజేశ్వరిదేవి అలంకరణ, 23న గాయత్రీదేవి, 24న కాత్యాయిని, 25న సంతాన లక్ష్మీదేవి, 26న అన్నపూర్ణ, 27న బాలత్రిపుర సుందరిదేవి, 28న ధనలక్ష్మి, 29న సరస్వతి, 30న మహిషాసురమర్దిని, అక్టోబర్ 1వ తేదీ మంగళగౌరి, 2న విజయలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శన భాగ్యం ఇస్తారని పేర్కొన్నారు. 3వతేదీ వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ప్రజల సహకారంతోనే భద్రత సాధ్యం

డోన్ టౌన్: ప్రజల భద్రత, ఆస్తి రక్షణ అందరి సహకారంతోనే సాధ్యమని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. దసరా సెలవుల దృష్ట్యా ఇంటికి తాళాలు వేసి వెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విలువైన వస్తువులు, నగదు, బంగారం ఇంట్లో ఉంచవద్దని, పొరుగువారికి సమాచారం ఇవ్వాలని, సీసీ కెమెరాలు, అలారం సిస్టంలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం


మంత్రి బీసీకి ఆహ్వానపత్రిక అందజేస్తున్న చౌడేశ్వరిదేవి ఆలయ అధికారులు


ఎమ్మెల్యే కోట్లను ఆహ్వానిస్తున్న మద్దిలేటిస్వామి ఆలయ ఈఓ

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులను ఆహ్వానించారు. శనివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి మంత్రి స్వగృహంలో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు.

- బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో జరగనున్న దసరా ఉత్సవాలకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డిని ఆహ్వానించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, సిబ్బంది ఆయన్ను కలిసి ఆహ్వానపత్రిక, స్వామివారి చిత్ర పటం అందజేశారు.

కామని ఆశయ సాధనకు కృషి చేద్దాం


కామని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కోవెలకుంట్ల: సాగునీటి ఉద్యమ నేత, కుందూ పోరాట సమితి కన్వీనర్ కామని వేణుగోపాల్‌రెడ్డి ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణ శివారులోని పేరా బిల్డింగ్‌లో ఆయన ప్రథమ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరీంబాషా, రాయలసీమ విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఓబులేసు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగన్న ప్రసంగించారు. కామని 25 ఏళ్ల క్రితం కుందూ నది పోరాట సమితిని ఏర్పాటు చేసి సాగునీటి కోసం అనేక పోరాటాలు చేశారని, అవుకు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు, సిద్ధేశ్వరం అలుగు ఏర్పాటుకు కృషి చేశారని కొనియాడారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల సాధనకు సాగునీటి ఉద్యమకారులు, ప్రజా సంఘాలు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. నాయకులు కత్తి ఓబులేసు, వడ్డె సుబ్బరాయుడు, అందనం దేవరాజు, వెంకటసుబ్బారెడ్డి, గోపిరెడ్డి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు విజయవంతం


కోవెలకుంట్ల: రక్తదానం చేస్తున్న యువకుడు,


కొలిమిగుండ్ల: వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మహిళలు

కోవెలకుంట్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు విజయవంతమయ్యాయి. స్వస్త్‌నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. నంద్యాలకు చెందిన స్పెషలిస్టు డాక్టర్లు రాఘవేంద్రారెడ్డి, శరత్, శ్రవంతి 350 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పట్టణానికి చెందిన 25 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్, వెంకటలక్ష్మి, లత, మోహజబీన్, గిరీష్, కృష్ణమూర్తి, నవీన్ నారాయణరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

- డోన్ టౌన్: స్త్రీలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం , సమాజం అభివృద్ధి చెందుతుందని కొత్తబురుజు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు శ్రీకాంత్, రాంభూపాల్, హరిత అన్నారు. గ్రామంలో మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మహిళలకు సాధారణంగా మూడు రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని, ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారించవచ్చని తెలిపారు. హెల్త్ ఆఫీసర్ వెంకటలక్ష్మీ, సూపర్‌వైజర్ నాగరత్న పాల్గొన్నారు.
- కొలిమిగుండ్ల: స్థానిక పీహెచ్‌సీలో మహిళల కోసం వైద్యశిబిరం నిర్వహించారు. ముందుగా మెడికల్ ఆఫీసర్ హరిచరణ్‌రెడ్డి మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి కార్యక్రమ ఉద్దేశం గురించి వివరించారు. ప్రతిజ్ఞ చేయించారు. క్యాన్సర్ స్క్రీనింగ్‌తో పాటు బీపీ, షుగర్, వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు, కిశోర బాలికలకు పరీక్షలు చేశారు. మహిళలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించాలనే లక్ష్యంతో కేంద్రం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


కోవెలకుంట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో శనివారం స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. కోవెలకుంట్ల, బేతంచెర్ల, బనగానపల్లె, డోన్, ప్యాపిలి, సంజామల మండలాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, గ్రామ, పట్టణ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. కోవెలకుంట్లలో డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి, ప్రత్యేక అధికారి కళ్యాణి, ఎంపీడీఓ వరప్రసాదరావు, తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. చెత్త, పిచ్చిమొక్కలు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. బేతంచెర్లలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ప్రత్యేక అధికారి బషీరున్నిసా బేగం , నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు, వైద్య సిబ్బంది, పొదుపు మహిళలు ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. బనగానపల్లె ఇల్లూరుకొత్తపేటలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మొక్కలు నాటి, ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పచ్చదనం పెంపొందించాలన్నారు. డోన్‌లో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి స్థానిక అధికారులతో కలిసి చెట్లు నాటి, పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ప్యాపిలిలో తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ప్రజలు ప్రతి నెలా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. సంజామలలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ సాల్మన్ మొక్కలు నాటారు. పరిశుభ్రత ద్వారా దోమల వ్యాధులను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. –సాక్షి నెట్‌వర్క్

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– నంద్యాల ఆర్ అండ్‌బీ రహదారిలో స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు తనిఖీ చేశారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.